**కథ**

# అతిథి దేవోభవ

**“ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది..” కూనిరాగం తీస్తూనే ఇంటి బూజంతా దులిపి శుభ్రంగా కడిగింది రోహిణి. బెడ్‌షీట్స్, కర్టెన్స్ అన్నీ తెల్లగా మెరిసిపోయేటట్లు ఉతికి ఆరేసింది.**

''ఏమిటోయ్ మనింటికి అప్పుడే పండగ కళ రప్పించేశావు?'' ఇల్లంతా అద్దంలా ఉండడం చూసి అన్నాడు సుధాకర్ ఇంటికి వస్తూనే.

''ఇల్లు అలకగానే సారీ ఇల్లు కడగగానే పండగ వచ్చేసినట్టేనా? పండుగ కళ రావాలంటే అర్జంట్‌గా ఇంకొక పని చేయాలి మీరు. పొద్దున చెప్పాను గుర్తులేదా?'' హెచ్చరిస్తున్నట్టుగా అన్నది రోహిణి.

''ఓస్...అదా మనందరం బజారుకెళ్ళి కొత్త బట్టలు కొనుక్కోవాలి అంతే కదా. అలాగే వెడదాంలే కానీ ముందర ఓ కప్పు కాఫీ ఇవ్వు'' అన్నాడు సుధాకర్.

అదెంతపని అన్నట్టు మిలమిల మెరిసే కాఫీ కప్పుతో క్షణాల్లో ప్రత్యక్షమైంది రోహిణి.

ఆ కొత్త కప్పులని పండగలూ, ప్రత్యేక సందర్భాలలోనే తీసి వాడుతుంది రోహిణి. మిగతా రోజుల్లో నీట్‌గా పాక్ చేసి దాచేస్తుంది. భర్త కాఫీ త్రాగేంతలో బొమ్మలా తయారై వచ్చింది రోహిణి. అమ్మానాన్నలతో బజారుకెళ్ళి బట్టలు కొనుక్కోవాలనే ఉత్సాహంతో అప్పటికే తయారైపోయారు పిల్లలు. రోహిణి ఈసారి మంచి ఖరీదైన జరీచీర కొనుక్కోవాలనుకుంది. తన భర్తకి ప్రమోషన్ వచ్చాక తాము జరుపుకునే మొదటి పండగ ఇది మరి. షాపింగ్ అయ్యాక హోటల్లో భోజనం చేయాలని తీర్మానించారు. అందరూ గడపదాటి కాలు బయటపెట్ట బోతుండగా మోగింది ఫోన్.

బైటికి రాబోతున్నవాడల్లా వెనక్కి తిరిగి ఒక అంగలో వెళ్ళి ఫోనందుకుంటూ ''హలో'' అన్నాడు సుధాకర్.

ఓ ఐదు నిముషాలు మాట్లాడి పెట్టేశాక ''ఏమోయ్ ఎవరో తెలుసా!'' తన కోసం వెయిట్ చేస్తూ బయట నుంచున్న భార్యనుద్దేశించి అన్నాడు.

''గుడ్‌న్యూస్ ఈ పండగకి మా తమ్ముడూ మరదలూ వస్తున్నారట పిల్లల్ని తీసుకుని'' మొహం వెలిగిపోతుండగా అన్నాడు సుధాకర్.

రోహిణికి ఏడుపొచ్చినంత పనైంది. ''ఇదేమంత సంతోషకరమైన విషయమా?'' మూతితిప్పుతూ అంది.

''అవున్లే మా వాళ్ళొస్తున్నారంటేనే నీకు ఒళ్ళు మంట. వాళ్ళని చూస్తే చాలు నీకు ఎక్కడలేని నీరసం వచ్చేస్తుంది''

''వండి వడ్డించాల్సిన దాన్ని నేను. నాక్కాకపోతే మీకొస్తుందా నీరసం? అయినా మొన్ననే కదండీ వచ్చి వెళ్లారూ'' విసుగ్గా అన్నది రోహిణి.

''పోనీలే వాళ్లేమన్నా పరాయివాళ్ళా ఏమన్నానా? స్వయానా సొంత తమ్ముడూ మరదలూనూ! వాళ్ళకా పల్లెటూళ్ళో తోచదు కాబట్టీ ఈ సిటీలో మనకన్నా అయినవాళ్ళూ, దగ్గరవాళ్ళూ లేరు కాబట్టీ వస్తున్నారు. వచ్చినవాళ్ళు నాలుగురోజులు ఉండి వెళ్ళిపోతారు. అంతేగానీ నీ ఇల్లూ, వాకిలీ పట్టుకుపోతారా ఏమన్నానా? పండగ ఇంకా నాలుగురోజులే ఉంది కాబట్టి ఇంట్లోకి కావాల్సిన సరుకులేవో గుర్తుచేసుకో. వచ్చేటప్పుడు కొనేస్తే అయిపోతుంది. అన్నట్టు పనిలో పని మీ తోటికోడలికి కూడా ఓ చీర తీసుకుందాం ఏమంటావు?'' భార్య వంక చూస్తూ అన్నాడు సుధాకర్.

రోహిణి మనసు కోపంతో రగిలిపోయింది. ఎంతసేపూ మా వాళ్లకి ఏం కొనాలి, ఏం పెట్టాలీ అని ఆలోచిస్తారీయన. వాళ్ళు మాత్రం హాయిగా చేతులూపుకుంటూ వస్తారు. పిల్లలకి కనీసం ఓ బిస్కెట్ పాకెట్ తెద్దామని కూడా ఉండదేమో. ఇక్కడ ఉన్నన్ని రోజులూ హేపీగా ఎంజాయ్ చేసేసి టాటా చెప్పి వెళ్లిపోతారు. మర్యాదకైనా తమని వాళ్లింటికి ఆహ్వానించరు.

''చూశావా... నీ మూడ్ మారిపోయింది. పోనీలే వాళ్ళని రావద్దని ఫోన్ చేసి చెప్తాలే'' సీరియస్‌గా అన్నాడు సుధాకర్.

'అతిథుల రాకవల్ల ఇంటి ఇల్లాలికి పని భారం పెరుగుతుందనీ, వంటగదిలో పని భారంతో తను తలమునకలౌతుంటే తోటికోడలు టీవీ ముందు సెటిలైపోతుందనీ ఆయనకి తెలీకా ఏమన్నానా? అన్నీ తెలిసినా అయినవాళ్ల కోసం ఆమాత్రం కష్టపడడంలో తప్పులేదంటారు. ఈయన్ని ఎలా అర్థం చేసుకోవాలో' నిట్టూరుస్తూ అనుకుంది రోహిణి.

అప్పటివరకూ హుషారుగా ఉన్న వాతావరణం గంభీరంగా మారిపోయింది. తల్లిదండ్రులిద్దరూ సీరియస్‌గా అయిపోవడంతో ఏంచేయాలో తెలీక బిక్కమొహాలేసుకు కూర్చున్నారు పిల్లలిద్దరూ.

''మీరేం ఫోన్ చేయక్కర్లేదు. ఇంతకుముందు మీ బంధువులెవరొచ్చినా మర్యాద లోపం చేశానా? ఏదో వంట్లో ఓపిక లేక అలా అన్నాగానీ పదండి. మీ మరదలికి కూడా ఓ మంచి జరీ చీర తీసుకుందాం'' భర్తని శాంతపరుస్తూ అంది రోహిణి.

పిల్లల మొహాల్లో మళ్లీ ఉత్సాహం వచ్చేసింది.

★ ★ ★

''మమ్మీ నా బార్బీడాల్, తమ్ముడి రిమోట్‌కారు కనిపించట్లేదు'' అంది కూతురు.

''అవా..అవన్నీ నేనే తీసి దాచాలే. మీ బాబాయ్ పిల్లలు అల్లరి పిడుగులు. అవి విరక్కొడతారు. వాళ్ళు వచ్చి వెళ్లిపోయాక తీసిస్తాలే. అప్పుడు ఆడుకుందురుగాని'' అంది రోహిణి.

ఇంట్లో ఉన్న కొన్ని ఆటసామాన్లు, బాల్, బ్యాట్ లాంటివన్నీ కూడా దాచేసింది రోహిణి. క్రిందటిసారి మరిది కొడుకు ఇంట్లో బాల్ ఆట ఆడాడు. ఆ బాల్ వచ్చి టీవీకి తగిలి స్క్రీన్ ముక్కలైంది. అప్పట్నించీ ఆ పిల్లలు ఆడుతూంటే ఏం పగలకొడతారో అని భయం రోహిణికి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్నీ తీసుకున్నాక అతిథుల రాక కోసం ఎదురుచూడసాగింది రోహిణి. మరిదీ వాళ్ల వస్తామని చెప్పిన టైం దాటిపోయింది. ఒకవేళ బస్సు లేటైనా ఈపాటికి వచ్చేయాలే అని ఆలోచిస్తున్న రోహిణి ఫోన్ మోగడంతో ఎవరబ్బా ఇప్పుడు ఫోన్ చేసేదీ అనుకుంటూనే ఫోన్ అందుకుంది. మరిది మాట్లాడాడు. పొద్దున్నే లేవలేకపోవడం వలన బస్సు మిస్సయ్యామనీ మధ్యాహ్నం బయలుదేరి వస్తున్నామనీ చెప్పాడు.

'ఇవాళ అందరి భోజనాలూ అయి తను పడుకునేసరికి పన్నెండుకి తక్కువకాదు. ఏం మనుషులో ఏమో! ఊరు వెళ్ళాలనుకున్నప్పుడు కాస్త పెందరాళే లేస్తే ఏం పోయింది. రాత్రి వచ్చి తనని ఇబ్బంది పెట్టకపోతే' అనిపించింది రోహిణికి.

'కొందరు మనుషులంతేనేమో! తమవరకూ కంఫర్టబుల్‌గా ఉండేలా చూసుకుంటారుగానీ ఎదుటిమనిషి ఇబ్బంది గురించి ఆలోచించరు' అనుకుంది.

రాత్రి దాదాపు పదిన్నర అవుతుండగా ఇంటి ముందర ఆటో ఆగింది. మనసులో విసుగ్గానే ఉన్నా ముఖాన నవ్వు పులుముకుంటూ అతిథులని ఆహ్వానించింది రోహిణి. వేళగాని వేళ వచ్చినా రెండు రకాల కూరలూ, పెరుగు, సాంబారుతో

డిన్నర్ రెడీ చేసింది రోహిణి. ఎక్కడ మర్యాద లోపం జరిగినా భర్త చిన్నబుచ్చుకుంటాడు మరి. తనవాళ్లంటే వల్లమాలిన అభిమానం సుధాకర్‌కి.

★ ★ ★

ఆ మర్నాడు బారెడు పొద్దెక్కినా ఇంకా లేవ లేదు సరిత. ''నిన్నంతా ప్రయాణం కదా వదినా బాగా అలసిపోయినట్టుంది. అందుకే కాబోలు ఇంకా లేవలేదు'' సర్దిచెప్పాడు రోహిణితో మరిది.

ఈ మరిదెప్పుడూ అంతే పెళ్లాన్ని వెనకేసుకొస్తాడు. 'తన భర్తా ఉన్నాడు ఎందుకూ..ఎప్పుడేం మాట్లాడాలో తెలియదు. వచ్చిన బంధువుల ముందే ఇవాళ పకోడీలు చెయ్యి, జీడిపప్పు ఎక్కువేసి పాయసం చెయ్యి' అని ఆర్డర్లు జారీచేస్తాడు. అలా అందరి ముందూ అడిగి చెయ్యమంటే చెయ్యకపోతే వచ్చిన వాళ్ళు ఏమనుకుంటారో అని చచ్చినట్టు చేసిపెడుతుంది తను. 'ఆ బోళాతనం, లౌక్యం తెలీకపోవడం తనకెన్నో ఇబ్బందులు తెచ్చిపెడుతుంది' అనుకుంది.

పండగ పనులతో అలసిపోయినా, పనెక్కువై సహనం నశించినా, ఓపిక తగ్గినా వాళ్ళున్న వారం రోజులూ అతిథి సత్కారాలకి లోటు రానీయలేదు రోహిణి. ఇంత బాగా వాళ్లని ట్రీట్ చేసింది కదా తమని వచ్చే పండక్కి వాళ్లింటికి ఆహ్వానిస్తారేమో అని ఎదురుచూసింది రోహిణి.

''వెళ్లి వస్తాం'' అన్నారే కానీ పొరపాటున కూడా ''మీరూ రండి'' అన్లేదు మరిది మురళీ గానీ, మరదలు సరిత గానీ.

★ ★ ★

''ఏమండీ ఈ సంక్రాంతి పండక్కి మనం మీ తమ్ముడూ వాళ్లింటికెడదామండీ'' అంది రోహిణి.

''వెడితే బాగానే ఉంటుంది కానీ పాపం వాళ్లు ఇబ్బంది పడతారేమో'' సానుభూతిగా అన్నాడు సుధాకర్.


''ఆ అతి మంచితనమే వద్దన్నాను. వాళ్ళొస్తే నేను మాత్రం ఇబ్బంది పడలేదా'' కయ్యిమంది రోహిణి.

''మనం వాళ్లకన్నా పెద్దవాళ్లం''

''మీ మరదలు కన్నా నేను ఏమంత పెద్దదాన్నని! వాళ్లకీ పెళ్లయి పిల్లలున్నారు. ఎపుడూ మర్యాదలు చేయించుకోవడమే కాదు మర్యాద చేయడంలో ఉన్న కష్టం ఏమిటో వాళ్లకీ తెలిసొస్తుంది'

''అయితే ఇప్పుడేమంటావ్?'' విసుగ్గా అన్నాడు సుధాకర్.

''ఈ పండగకి మనం వాళ్లింటికి వెళ్లాలంటాను''



''కానీ వాళ్ళు మనని మాట వరసకి కూడా రమ్మనలేదుగా'' సందేహించాడు సుధాకర్.

''ఆ మాట నిజమే కానీ మీ సొంత తమ్ముడేగా పిలిస్తేనే వెళ్ళాలనే పంతం ఎందుకూ? మన

**ఆదుర్తి బాల**

మూలంగా మీ వాళ్ళు ఇబ్బంది పడే పరిస్థితి రానివ్వను లెండి. అంతగా అవసరమైతే మీ మరదలికి పనిలో సాయం చేస్తాను'' భరోసా ఇస్తున్నట్టుగా అంది రోహిణి.

''ఆ మాట అన్నావు బాగుంది''

''హమ్మయ్య'' ఊపిరి పీల్చుకుంది రోహిణి. పిల్లలున్న ఇంటికి వట్టిచేతుల్తో వెళ్లడం ఎందుకని

జంతికలూ, లడ్లూ తయారుచేసుకుని వాళ్ళకివ్వడానికని ఓ పెద్ద క్యారియర్ నిండా సర్దింది రోహిణి.

తాము వస్తున్నట్లుగా ఫోన్‌చేసి బస్సెక్కారు రోహిణి, సుధాకర్‌లు పిల్లల్ని తీసుకుని.

★ ★ ★

ఇంటికొచ్చిన అన్నా వదినలని సాదరంగా ఆహ్వానించారు తమ్ముడు మురళి, అతని భార్య సరిత. ప్రయాణం చేసి వచ్చారేమో బాగా అలసటగా తల నొప్పిగా ఉంది రోహిణి, సుధాకర్‌లకి. సరిత కాఫీ ఇస్తే బాగుండుననిపించింది. ఓ అరగంట కబుర్లయ్యాక కాఫీ కలపడానికని లేచింది సరిత. తాము తీసుకొచ్చిన జంతికలు తిని మంచినీళ్ళు త్రాగి పిల్లలు ఆటల్లో పడ్డారు.

''వెధవ పిల్లలు ఇల్లు పీకి పందిరేస్తున్నారు. అంతా బైటికి పోయి ఆడుకోండి'' ఇంట్లో గెంతుతూ ఆడుతున్న పిల్లల్ని గట్టిగా మందలించాడు మరిది మురళి.

రోహిణి మనసు చివుక్కుమంది. 'వాళ్ల పిల్లలు తనింటికొచ్చినపుడు ఎంత అల్లరి చేసేవాళ్ళు. వాళ్లు సోఫాలెక్కి తొక్కినా పరుపుల మీద గెంతినా మురళిగానీ సరితగానీ వాళ్లని ఒక్కమాట అనేవారు కాదు. ఇప్పుడు మాత్రం వీళ్ళ వస్తువులు ఎక్కడ పాడుచేస్తారేమోనని బాధపడి పోతున్నాడు మురళి. ఎదుటివాళ్ల వస్తువులు పాడైపోయినా ఫర్వాలేదు తమ వస్తువులు పదిలంగా ఉంటే చాలు. ఎంతైనా మరిది గడుసువాడు' అనుకుంది రోహిణి.

కాఫీలు త్రాగాక రాత్రి ఎనిమిదింటికి కానీ వంట ప్రయత్నం మొదలు పెట్టలేదు సరిత. రోహిణికీ, సుధాకర్‌కీ ఆకలి దంచేస్తోంది. చిరుతిళ్ళు తిన్న పిల్లలు నిద్రకు పడుతున్నారు.

''వంటయింది రండి అక్కా'' అన్న సరిత పిలుపుకి ప్రాణం లేచి వచ్చింది రోహిణికి.

అందరూ కాళ్ళు కడుక్కుని భోజనానికి కూర్చున్నారు. కూర, అన్నం కూడా తక్కువగా ఉన్నట్టనిపించాయి రోహిణికి. అందరూ ఒకేసారి తింటే అన్నం సరిపోదేమో అనిపించి ''మనం తరువాత తిందాంలే సరితా ముందర మగవాళ్లకీ పిల్లలకీ వడ్డిద్దాం'' అంది రోహిణి.

''అక్కర్లేదు వదినా ఇప్పటికే చాలా లేటయింది అందరం ఒకేసారి తింటే పనైపోతుంది కదా'' మురళి కలగజేసుకున్నాడు.

'అందరం ఒకేసారి తిని లేస్తే పెళ్లాంకి పని సులువని ఆలోచిస్తున్నాడు మరిది. పెళ్లామంటే ఎంత ప్రేమో!' అనుకుంది రోహిణి.

''అదికాదమ్మా సరితా అన్నం కూర సరిపోవేమో అందరికీ. వాళ్ళు తిన్నాక ఉన్నది మనం సర్దుకుందాంలే'' సరితని పక్కకి పిలిచి అన్నది రోహిణి.

సరిత నవ్వేసింది. ''అదా మీకా భయం అక్కర్లేదు. ఉన్నదేదో అందరం సర్దుకు తినేద్దాం. అన్నం గానీ, కూరలుగానీ మిగిలిపోవడం నాకిష్టం ఉండదు. ఓ ముద్ద తక్కువ తింటే మన ఆరోగ్యానికి మంచిదట'' అన్న సరిత తెలివితేటలకి నిర్ఘాంతపోయింది రోహిణి.

ఇంకొంచెం అన్నం వడ్డించమనడానికి మొహమాటపడ్డారు సుధాకర్, రోహిణిలు.

కొద్దిగా వడ్డించుకుని అర్ధాకలితో చెయ్యి కడుక్కున్నారు. ఆకలి కడుపుతో పడుకున్నారేమో చాలాసేపటివరకూ నిద్రపట్టలేదు వాళ్లకి.

మర్నాడు రోహిణి లేచేసరికి మురళినే కాఫీ కలిపి తెచ్చాడు.

''నిన్న పని ఎక్కువైంది కదా వదినా అలసటగా ఉందిట సరితకి'' సంజాయిషీగా అన్నాడు మురళి. సరిత అలసిపోవడానికి మీరే కారణం అన్నట్టుగా తోచాయి రోహిణికి ఆ మాటలు. ఏది ఏమైనా తమ రాక వాళ్లకి సంతోషం కన్నా ఇబ్బందిగా ఉన్నట్టు తోచింది రోహిణికి.

కాఫీ త్రాగుతూ ఆలోచిస్తున్న రోహిణి దగ్గరకు వచ్చాడు సుధాకర్. అతడికి ఈ ఇంటి వాతావరణం నచ్చలేదని అతని ముఖమే చెబుతోంది.

''ఇవాళ వంట నువ్వే చేయి. అన్నం కాస్త ఎక్కువ వండు. ఈ పల్లెటూళ్ళో ఆకలేస్తే బయట తినడానికి సరైన హోటల్స్ కూడా లేవు'' అంటున్న భర్తని జాలిగా చూసింది రోహిణి. ఇక తప్పదని వంటింటికేసి నడిచింది.

వంటిల్లంతా సర్దినట్టులేదు. రాత్రి అందరూ తిన్న ఎంగిలి కంచాలూ, గ్లాసులూ సింక్‌లోనే ఉన్నాయి. గ్యాస్ స్టవ్ గట్టుమీద నూనె మరకలూ, కూరముక్కలూ... సరిత ఇంకా లేచినట్టు లేదు. నిజంగా నిద్రపోతోందో, నిద్ర నటిస్తోందో తెలీదు. భర్త ఆకలికి ఆగలేడు. తనిక రంగంలోకి దిగకపోతే లాభం లేదు. రోహిణి చీరకొంగు నడుంకి చుట్టి పనిలోపడింది. వంటిల్లంతా సర్ఫ్ నీళ్లతో కడిగి శుభ్రం చేసి తను కూడా స్నానం చేసి వచ్చి వంటకు ఉపక్రమించింది. టైం తొమ్మిదిన్నర. వదిన పనిచేయడం చూస్తున్నా మురళి భార్యని లేపే ప్రయత్నం చేయలేదు.

''సారీ అక్కా మీకు శ్రమ ఇచ్చాను'' ఓ అరగంట పోయిన తర్వాత వచ్చి రోహిణితో అపాలజీ చెబుతున్నట్టు అంది సరిత.

''ఫర్వాలేదులే'' బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకున్నది రోహిణి.

వంట పూర్తయి భోజనాలవగానే పెట్టె సర్దడం మొదలుపెట్టాడు సుధాకర్.

''ఇప్పుడు పెట్టె సర్దుతున్నారేమిటండీ'' అన్న భార్యతో-

''మనం మన ఊరెళ్ళిపోతున్నాం. పిల్లల్ని రెడీచేసి నువ్వూ తయారుకా'' అన్నాడు సుధాకర్.

''ఇవాళ పెద్ద పండగండీ. ఇవాళ వెడితే బాగుంటుందా మీ తమ్ముడు నొచ్చుకుంటాడేమో!'' అన్న రోహిణి వంక చూస్తూ ''పిచ్చిదానా మనం ఉంటేనే నొచ్చుకుంటారు వాళ్ళు. వెడితేనే సంతోషిస్తారు. నువ్వు బయల్దేరు ముందు'' అన్నాడు సుధాకర్.

''అదేంటి అన్నయ్యా ఇవ్వాళే వెళ్లిపోవడమేమిటి?'' అన్న మురళితో

''సారీ నేనిక్కడ ఉండలేకపోతున్నాను. కారణం నీకు చెప్పక్కరలేదనుకుంటా''

సరితా, మురళి ముఖాలు చూసుకున్నారు.

''అతిథి దేవోభవ అని ఊరికే అనలేదురా మన పెద్దలు. ఇంటికొచ్చిన అతిథిని దేవుడిలా భావించే సంప్రదాయం మనది. ఆ సంప్రదాయాన్ని గౌరవించి నువ్వెన్నిసార్లు మా ఇంటికి వచ్చినా సంతోషంగా ఆతిథ్యమిచ్చాను. వస్తూ పోతుంటేనే బంధుత్వం అని నమ్మిన పాతకాలం వాడిని కాబట్టి నా తమ్ముడూ, నా వాళ్ళూ అని ప్రాకులాడాను. కానీ నువ్వేం చేశావ్? వంటచేసే పని తప్పించుకోవడానికి నీ భార్యని నిద్ర నటించమని చక్కటి సలహా ఇచ్చావ్'' మురళి కంగారుగా చూశాడు.

సుధాకర్ గంభీరంగా మారిపోయాడు. ''వంటపని వదిన చేత చేయించి ఆ ప్లాన్ సక్సెస్ అయిందని మీరు సంతోషపడడం అనుకోకుండా నా కంటపడింది. చూడు మురళీ చివరిగా ఒక మాట. మర్యాద ఇచ్చినవాడికే మర్యాద పొందే హక్కుంటుంది. నువ్వు ఆ హక్కుని పోగొట్టుకున్నావు. దయచేసి ఇంకెపుడూ మా ఇంటికి రాకు'' భార్యా పిల్లలని తీసుకుని గుమ్మం దాటాడు సుధాకర్.

❀

